www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

శుక్రవారం 12 మే 2023

హెల్మెట్‌పై ప్రాజెక్టు ఆఫీసర్ అవగాహన



నస్పూర్ : శ్రీరాంపూర్ ఉపరితల గనిలో హెల్మెట్‌పై గురువారం ప్రాజెక్ట్ ఆఫీసర్ పురుషోత్తంరెడ్డి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ చాలామంది హెల్మెట్ ధరించక రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారన్నారు. అందరూ తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించి డ్యూటీకి రావాలని సూచించారు. అంతేకాకుండా ఇంటి నుండి బయలుదేరేటప్పుడు ఎప్పుడైనా సరే హెల్మెట్ ధరించి బయటికి వెళ్లాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ సుధీర్ జక్కులవార్, సేఫ్టీ ఆఫీసర్ ఐ.శ్రీనివాస్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ అంజాద్ అలీ, సంక్షేమ అధికారి శంకర్ పాల్గొన్నారు.

వరి ధాన్యం ఆరబెట్టి తీసుకురావాలి



దహెగాం : వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు ఆరబెట్టి తీసుకురావాలని డీఎం గోపాల్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు లగ్గాం, ఒడ్డుగూడలో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం ఆరబెట్టిన తర్వాత ప్యాడిక్లీనర్ పోయాలని సూచించారు. మళ్లీ వర్షాలు వచ్చే అవకాశమున్నందున రైతులు జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు శోభన్, వెన్నెల, సీఈఓ బక్కయ్య, సెంటర్ ఇన్‌చార్జిలు నారాయణ, జీవన్ పాల్గొన్నారు.

ఘనంగా సామల సదాశివ జయంతి



కాగజ్‌నగర్ : కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత సామల సదాశివ మాస్టారు 96వ జయంతి వేడుకలను గురువారం కాగజ్‌నగర్‌లోని పద్మశాలి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. మాస్టారు జయంతి వేడుకలను ప్రభుత్వమే నిర్వహించాలని ఈ సందర్భంగా సంఘం నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి హనుమాండ్ల కేదారి, నాయకులు జి నాగేశ్వర్‌రావు, జి మల్లయ్య, వి వెంకన్న, డి సురవర్ధన్, ఎం రామకృష్ణ, డి సత్యనారాయణ, గురువయ్య, కటకం మధూకర్, ఎం తిరుపతయ్యతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

సదాశివ విగ్రహం వద్ద...

పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న సామల సదాశివ విగ్రహం వద్ద పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జయంతిని ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ వైస్ ఛైర్మన్ కోనేరు కృష్ణారావు, సంఘం సభ్యులు సామల సదాశివ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు సాహితీ సదస్సు సభ్యులు పెంద్యాల కిషన్‌శర్మ, సంఘం ప్రధాన కార్యదర్శి కొంగ సంపత్‌కుమార్, గౌరవాధ్యక్షులు కటకం మధూకర్, బి సమ్మయ్య, సభ్యులు పాల్గొన్నారు.

రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి

పెంచికల్‌పేట్ : రైతులు లైసెన్సు కలిగిన ఫర్టిలైజర్ కేంద్రాల్లో మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారిణి గౌసియాబేగం అన్నారు. గురువారం మండలంలోని ధరోగపెల్లి, బొంబాయిగూడ గ్రామాల్లో రైతులకు విత్తనాలు, ఆయిల్ పామ్ మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లోకి వచ్చి విత్తనాలు అమ్మినట్టయితే వ్యవసాయాధికారులకు గాని, పోలీస్ శాఖకు గాని సమాచారం అందించాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు విత్తనాల సంచిపై కంపెనీ పూర్తి వివరాలతో పాటు బార్‌కోడ్, లైసెన్స్ నెంబర్, కంపెనీ అడ్రస్ వంటి అంశాలను తప్పకుండా చూసుకోవాలని, ఏవైన సందేహాలు ఉన్నట్టయితే వ్యవసాయాధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



నవతెలంగాణ-సారంగాపూర్

రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పిఎసిఎస్ చైర్మన్ నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కౌట్ల(బి), స్వర్ణ, జౌళి గ్రామాల్లో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతుబంధు మండల కన్వీనర్ మధుకర్‌రెడ్డి, అడెల్లి ఆలయ చైర్మన్ అయిటి చందు, మార్కెట్ ఛైర్మన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు పండించిన పంట దళారులకు అమ్మి మోసపోకుండా ఉండేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. క్వింటాల్‌కు రూ. 1962 మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మండల కన్వీనర్ మాధవ్‌రావు, ఎంపీటీసీ భోజారెడ్డి, సిఈఓ సలీం, రైతులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకం అభివృద్ధి పథకం ద్వారా లబ్ది పొందాలి



నవతెలంగాణ-తాండూర్

గొల్ల కురుమ సంఘాలు గొర్రెల పెంపకం అభివృద్ధి పథకం ద్వారా లబ్ధి పొందాలని జిల్లా పశు వైద్యాధికారి శంకర్ తెలిపారు. మండలంలోని కిష్టంపేట రైతువేదికలో గొర్రెల పెంపకం అభివృద్ధి పథకం గురించి లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వై.రమేష్‌కుమార్ పథకం వివరాలు వెల్లడించారు. లబ్ధిదారులు రూ.43,750 చెల్లించి నాణ్యమైన గొర్రెల మందను సబ్సిడీ ద్వారా పొందొచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి పూసాల ప్రణయ్, జెడ్పిటిసి సాలిగామ భానయ్య, కాసిపేట గ్రామ సర్పంచ్ రమేష్, పశు వైద్యాధికారి పివి నర్సింహారావు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యల పరిష్కారానికి కృషి



ఆదిలాబాద్‌టౌన్: ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన సంఘం సభ్యులను రిమ్స్ బయో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ప్రజా ఆరోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాం, రాష్ట్ర నాయకులు అనిల్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్లు సంతోష్, మహేందర్, పల్లవి పాల్గొన్నారు.

దళితబంధు దరిచేరేదెప్పుడో..?

- రెండో విడతపై విడుదల కాని మార్గదర్శకాలు
- తాజాగా 1100మంది చొప్పున పంపిణీకి యోచన
- ప్రభుత్వ సాయంపై అనేక మంది ఎదురుచూపులు

దళితుల ఆర్థికాభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకం రెండో విడత మార్గదర్శకాలు విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ పథకం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించినా పథకం అమలుకు సంబంధించి విధివిధానాలు వెల్లడికావడం లేదు. దీంతో రెండో విడత సాయంపై అధికారవర్గాల్లోనూ అస్పష్టత నెలకొంది. సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ దళితబంధు పథకంపైనే తొలి సంతకం చేశారు. తదనంతరం మార్గదర్శకాలు వస్తాయని అందరూ భావించారు. కానీ పది రోజులు గడుస్తున్నా జిల్లా అధికారులకు ఈ పథకానికి సంబంధించి ఎలాంటి సమాచారం రావడం లేదు. దీంతో ఈ పథకం కోసం అర్హులైన అనేక మంది దళితవర్గాలు ఎదురుచూస్తున్నాయి. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంతో అభివృద్ధి దిశగా అడుగులు వేద్దామని ఆశతో ఉన్నారు. రోజువారీగా కార్యాలయానికి వెళ్లి అధికారులను అడిగి ఈ పథకంపై ఆరా తీస్తున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అభివృద్ధిలో అట్టడుగున ఉన్న దళితులను అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు పథకాన్ని తీసుకొచ్చింది. దళితులను ఆదుకునేందుకు ఒక్కో కుటుంబానికి రూ.10లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేయాలని సంకల్పించింది. ఇందులో భాగంగా తొలి విడతలో నియోజకవర్గానికి 100 కుటుంబాల చొప్పున ఈ ఆర్థిక సాయం అందించింది. ఉమ్మడి జిల్లాలో వెయ్యి కుటుంబాలు ఈ పథకంలో లబ్దిపొందగా ఆదిలాబాద్ జిల్లాలో 249 కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాయి. ఈ పథకం కింద అందజేసే డబ్బులతో వాహనాలు కొనుగోలు చేయడం, పశు పోషణ తదితర రకాల యూనిట్లు స్థాపించి స్వయం ఉపాధి పొందేలా శిక్షణ ఇచ్చారు. ప్రతి ఏటా ఈ పథకం నిరంతరం కొనసాగుతుందని ప్రభుత్వం చెబుతోంది. ఇందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఈ పథకం కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. ఇది వరకు అందజేసిన లబ్దిదారుల నుంచి కొందరు ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలున్నాయి. ఇందుకు ముఖ్యమంత్రి కూడా ఈ పథకంలో అవినీతి పాల్పడిన వారి చిట్టా తన వద్ద ఉందని పేర్కొనడంతో అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. మరోసారి ఇలాంటి పరిస్థితి రానీయొద్దని ఖరాఖండిగా చెప్పడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

రెండో విడత ఎప్పుడో..?

ఈ పథకం బడుగుల జీవితాల్లో వెలుగులు నింపేలా ఉండటంతో అనేక మంది ఈ పథకంపై ఆశలు పెట్టుకున్నారు. తొలి విడతలో పైలట్ ప్రాజెక్టు కింద నియోజకవర్గానికి 100 కుటుంబాల చొప్పున అందజేసిన ప్రభుత్వం ఈ ఏడాది ఈ సంఖ్యను భారీగా పెంచుతోంది. రెండో విడతలో ఒక్కో నియోజకవర్గానికి 1100మంది చొప్పున ఎంపిక చేయాలని భావిస్తోంది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రానున్న కాలంలో ఏకంగా 11వేల దళిత కుటుంబాలకు లబ్ది చేకూరనుంది. ప్రస్తుతం లబ్దిదారుల ఎంపిక బాధ్యత ప్రభుత్వం ఎమ్మెల్యేలకు అప్పగించింది. కానీ ఈ నిర్ణయంపై కొందరు హైకోర్టుకు వెళ్లినట్లు తెలిసింది. దీంతో ఈ విడత కూడా ఎంపిక బాధ్యత ఎమ్మెల్యేలకే ఉంటుందా.. అధికారులకు అప్పగిస్తుందా అనేది ఇంకా తేలడం లేదు. తొలి విడతలో ఎలాంటి నిబంధనలు లేకుండా పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టారు. రెండో విడతలో మాత్రం ఈ పథకానికి సంబంధించి స్పష్టమైన విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేస్తుందని అధికారులు చెబుతున్నారు. అర్హుల గుర్తింపు ఎలా.. గ్రామాల వారీగా ఎంపిక చేస్తారా.. మండలం యూనిట్‌గా తీసుకొని ఎంపిక ఉంటుందా అనేదానిపై స్పష్టత లేకుండా పోయింది. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు ఆలస్యం కావడంతో లబ్దిదారులు నిరుత్సాహానికి గురవుతున్నారు.



ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదు : శంకర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ఆదిలాబాద్



రెండో విడత దళితబంధు పథకం అమలుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. అర్హుల ఎంపిక విషయమై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాలేదు. నిబంధనలు రాగానే లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టేందుకు అవకాశం ఉంటుంది.

అంకిత భావంతో పనిచేయాలి : ఎస్పీ సురేష్‌కుమార్



నవతెలంగాణ - రెబ్బెన

పోలీసులు విధుల పట్ల అంకిత భావంతో పని చేయాలని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. గురువారం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, దర్యాప్తు వివరాలను ఎస్ఐ భూమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో రోజూవారీగా నమోదవుతున్న ఫిర్యాదులు, కేసుల రికార్డులను పరిశీలించారు. రిసెప్షన్, లాకప్‌మెన్, బ్యారెక్, టెక్నికల్ గదులను పరిశీలించారు. పోలీస్ సిబ్బందితో మాట్లాడి వారి విధుల గురించి అడిగారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రిసెప్షన్ కౌంటర్‌లో నమోదు చేసిన రిసెప్షన్ డైరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. న్యాయబద్ధంగా చట్టాన్ని అమలు చేయడం పోలీసుల బాధ్యతని, ముందుగా చట్టాలను స్వయంగా పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. అనుమానిత వ్యక్తులు కనిపించిన వెంటనే తనిఖీ చేయాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా పటిష్టంగా పెట్రోలింగ్ నిర్వహించాలని పేర్కొన్నారు. డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు నిర్వహించి ప్రమాదాలను నివారించడానికి కృషి చేయాలని, ఆర్థిక నేరాలను కట్టడి చేయడానికి సీసీ కెమెరాలు అమర్చే విధంగా ప్రజలను చైతన్యపరచాలని పేర్కొన్నారు. విజ్బుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రతిరోజు వాహనాల తనిఖీ నిర్వహించాలని తెలిపారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్‌లో అధికారులు పాత నేరస్తులను తనిఖీ చేయాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణ గురించి గ్రామాల్లో ప్రజలకు, యువకులకు గ్రామాల వీసీఓలు, పోలీస్ అధికారులు, సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ అల్లం నరేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనాల పెంపుదలకు పోరాటం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

కనీస వేతనాల పెంపుదల, సామాజిక భద్రత, పని గంటల తగ్గింపుకు పోరాడుదామని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె రాజన్న అన్నారు. భారత కార్మిక సంఘాల సమైక్య ఆధ్వర్యంలో మండలంలోని సిర్గాపూర్ బీడీ కంపెనీ ఫ్యాక్టరీలో జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచాయని, కార్మిక వర్గానికి అందుతున్న వేతనాలతో కాలం గడపడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం కార్మిక అనుకూల చట్టాలను రద్దుచేసి పారిశ్రామిక హక్కుల చట్టాలను తీసుకొచ్చిందని మండిపడ్డారు. కెసిఆర్ ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా శ్రమదోపిడీకి పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రంగాల కార్మికులకు శాస్త్రీయంగా వేతనాలను నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. 24 గంటలు దుకాణాలు తెరిచి ఉంచుకోవచ్చని కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ చట్టాల నిలిపివేతకు పోరాడుదామని పిలుపునిచ్చారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయడానికి ఉద్యమించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల, విఏఓల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్యామ్‌రావు, నారాయణ, లక్ష్మణ్, రాజు, జమున, కిషన్, మహేందర్ పాల్గొన్నారు.

భూముల క్రమబద్ధీకరణ చేసుకోవాలి

ఆసిఫాబాద్ : జీవో నెంబర్ 59 ప్రకారం భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు పెట్టుకున్న వారు పూర్తిస్థాయిలో చెల్లింపులు చేసి రెండు రోజుల్లో క్రమబద్ధీకరించుకోవాలని ఆసిఫాబాద్ తహసీల్దార్ రామ్మోహన్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిమాండ్ నోటీసు ప్రకారం చలాన్ కట్టని వారు వెంటనే అప్రమత్తం కావాలని సూచించారు.

ప్రావిడెంట్ ఫండ్ సకాలంలో జమ చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సింగరేణిలో జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీగా నియామకం పొంది, ప్రస్తుతం వివిధ విభాగాల్లో పర్మినెంట్ పోస్టింగ్ తీసుకున్న వారికి ప్రావిడెంట్ ఫండ్ జమ కావడం లేదని, వారికి ప్రావిడెంట్ ఫండ్ సకాలంలో జమ చేసి సమస్యను పరిష్కరించాలని టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం త్రైమాసిక సమావేశం నిర్వహించారు. దీనికి కోల్ మైండ్స్ ప్రావిడెంట్ కమిషనర్ పచోరితో ఆయన పాల్గొని మాట్లాడారు. సంస్థలో ఒకవైపు యాజమాన్యానికి, మరోవైపు కార్మికులకు వారధిగా ఉన్నటువంటి సూపర్వైజర్లకు వారి ప్రావిడెంట్ ఫండ్ సకాలంలో ఖాతాలో జమ కాకపోవడం వల్ల తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ 15 రోజుల్లోనే మైనింగ్ సభ్యుల సమస్యను పరిష్కరిస్తామని, వారి ఖాతాల్లో ప్రావిడెంట్ ఫండ్ జమ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎస్ఓ టు జీఎం గోపాల్‌సింగ్, ఆర్కే5,6 గ్రూప్ ఏజెంట్ ఏవిరెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే కౌన్సెలింగ్ నిర్వహించాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి వ్యాప్తంగా అండర్ గ్రౌండ్ నుండి ఓపెన్ కాస్ట్‌కు వెళ్లే ఓవర్ మెన్‌లకు మే 18న జరిగే వెబ్ కౌన్సెలింగ్ పాత పద్ధతిలో సీనియారిటి ప్రకారంగా నిర్వహించాలని ఏఐటీయూసీ మైనింగ్ స్టాఫ్ బెల్లంపల్లి రేషన్ కార్యదర్శి వంగరి రాజేశ్వరరావు, మైన్స్ స్టాఫ్ నాయకులు గోపతి సత్యనారాయణ, మారపల్లి బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓవర్ మెన్‌లకు నిర్వహించే కౌన్సెలింగ్‌లో కొత్త నిబంధనలు విధించడంతో ఓవర్‌మెన్‌లందరూ భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా యాజమాన్యం 18న జరిగే వెబ్ కౌన్సెలింగ్ పాత సర్క్యులర్ ప్రకారం నిర్వహించాలని డిమాండ్ చేశారు.

తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉన్నత లక్ష్యాలను సాధించి తల్లిదండ్రుల కలలను సాకారం చేసేలా విద్యార్థులు చదువులో రాణించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. ఇటీవల పది, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు విడుదల నేపథ్యంలో గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పది, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని కనబరుస్తూ మరిన్ని విజయాలు పొందాలని ఆకాంక్షించారు. విద్యార్థులు అన్ని విషయాలపై పట్టు సాధించాలన్న ఆయన తల్లిదండ్రుల స్వప్నాలను సాకారం చేసి ప్రత్యేక గుర్తింపు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ట్రైనీ సహాయ కలెక్టర్ శ్రీజ, డీఈఓ ప్రణీత, డీఐఈవో రవీందర్, డిఎండబ్ల్యూఓ కృష్ణవేణి పాల్గొన్నారు.

మౌలిక వసతులకు భూమిపూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా మావల మండలంలోని జెడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్‌లో రూ.68లక్షలతో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన విద్యతో పాటు ఆహ్లాదకర వాతావరణం అందించడమే కాకుండా కార్పొరేట్‌కు దీటుగా పేద కుటుంబంలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. కేజీ టు పీజీ ఉచిత విద్య అందించడం గొప్ప విషయమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేపట్టడం గర్వకారణమన్నారు. మావల మండలం నుంచి ఆదిలాబాద్ వరకు స్ట్రీట్ లైట్, రోడ్లు, మురికి కాలువలు అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పిటిసి నల్ల వనిత రాజేశ్వర్. ఎంపీపీ దర్శనాల సంగీత ఏవన్, మాజీ ఎంపీపీ చందల ఈశ్వరి రాజన్న, సర్పంచ్ దొగ్గలి ప్రమీల రాజేశ్వర్, ఉప సర్పంచ్ మహేందర్, ఎంపీడీవో అరుణ, ఎంఈఓ జయశీల, బీఆర్‌ఎస్ కన్వీనర్ గంగుల కిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్ పాల్గొన్నారు.

ఆకాశవాణి కేంద్రంలో అలరించిన 'అడవి మల్లెలు'



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

ఆకాశవాణి ఆదిలాబాద్ రేడియో కేంద్రంలో గురువారం గిరిజన విద్యార్థులు ఆలపించిన సామాజిక, జానపద, దేశభక్తి గీతాలు ఎంతగానో అలరించాయి. ఐటీడీఏ పిఓ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మర్ సమ్మిట్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. అందులో భాగంగానే రేడియో కేంద్రంలో నిర్వహించిన అడవి మల్లెలు కార్యక్రమంలో నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. పది రోజుల నుంచి ట్యూటర్లు ఉదారి నారాయణ, జాదవ్ అశోక్ నేర్పించిన తెలుగు దేశభక్తి సామాజిక పాటలు, కథలు, కవితలు, నేనే కలెక్టర్ నైతే, ఇంగ్లీష్ స్టోరీ టెల్లింగ్ వంటి కార్యక్రమాలు విద్యార్థులను ఎంతో ఉత్సాహపరిచాయి. ఆకాశవాణి స్టూడియోలో అడవి బిడ్డలు ఎటువంటి బెరుకు భయం లేకుండా సదరు గీతాలను అద్భుతంగా ఆలపించాలని నిర్వాహకులు పేర్కొన్నారు. అనంతరం రేడియో కేంద్రం పనితీరును నిర్వాహకులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు



కాగజ్‌నగర్ : కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో బుధ, గురువారాలలో నిర్వహించిన స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ) కౌన్సిల్ సమావేశాలలో విద్యారంగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తీర్మానాలు చేసినట్లు ఫెడరేషన్ ఆలిండియా జనరల్ కౌన్సిల్ సభ్యురాలు వైద్య శాంతికుమారి తెలిపారు. ఈ సమావేశాలకు తెలంగాణ రాష్ట్రం నుండి తనతో పాటు ఉపాధ్యక్షులు చావ రవి, సంయుక్త సీఈసీ సభ్యులు దుర్గభవాని, జనరల్ కౌన్సిల్ సభ్యులు జంగయ్య హాజరైనట్లు ఆమె వివరించారు. ప్రభుత్వ విద్యారంగ సమస్యలపై చర్చిస్తూనే, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసుకునే దిశగా ఈ సమావేశాలు కొనసాగినట్లు తెలిపారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఎన్ఈపీ రద్దు, పాఠ్యాంశాల తొలగింపు లాంటి విధానాలను మానుకోవాలని తీర్మానాలు చేసినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-కడెం



మండలంలోని పెద్ద బెల్లాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే అజ్మీరా రేఖ శ్యామ్ నాయక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వెను వెంటనే రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యం తరలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి, నిర్మల్ జిల్లా జెడ్పీ కోఆప్షన్ మెంబర్ ఎండి రఫీక్ అహ్మద్, పెద్ద బెల్లాల్ సర్పంచ్ రమాదేవి సురేందర్, కడెం బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రుయ్యాడి గ్రామవాసికి గణితంలో డాక్టరేట్

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన అర్గుల శ్రీనివాస్ గణితంలో డాక్టరేట్ పొందాడు. డా.వి.కిరణ్ అసోసియేట్ ప్రొఫెసర్ పర్యవేక్షణ కామన్ ఫిక్స్ పాయింట్ థీరంస్మా ఏక్ పోల్ వీక్లి కంపి టేబుల్ సెల్ఫ్ మ్యాథ్స్ ఆఫ్ ఏ ఎస్ మెట్రిక్ స్పేస్ అనే అంశంపై అధ్యయనం చేసినందుకు గాను శ్రీనివాస్‌కు గణితంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ ప్రధానం చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా రుయ్యాడి గ్రామస్తులు, మండల ప్రజలు శ్రీనివాస్‌ను అభినందించారు.

భైంసాలో పోలీసుల నిర్బంధ తనిఖీలు



నవతెలంగాణ-భైంసా

పట్టణంలోని గణేష్‌నగర్ జుల్ఫికర్ గల్లీలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం తెల్లవారు జామున పోలీసులు నిర్బంధ తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని ఐదు ఆటోలు, నాలుగు ఫోర్ వీలర్లు, 59 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు, ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ అక్కడి ప్రజలకు అవగాహన కల్పించారు. వాహన చోదకులు నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, బైక్ రైడర్లు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని సూచించారు. తనిఖీల్లో ఎస్సైలతో పాటు 80 మంది పోలీసులు పాల్గొన్నారు.

పదో తరగతి ఫలితాల్లో జిల్లా అగ్రస్థానంలో నిలవడం గర్వకారణం



నవతెలంగాణ-నిర్మల్

పదోతరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవడం మనందరికీ గర్వకారణమని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. గురవారం జిల్లాకేంద్రంలోని ప్రియదర్శినినగర్‌లోని మున్సిపల్ చైర్మెన్ నివాసంలో డీఈఓ రవీందర్‌రెడ్డి, ఆయా ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ ఈశ్వర్ మాట్లాడారు. రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఉచిత మెటీరియల్ అందించి విద్యార్థుల విజయానికి తన వంతుగా సహకరించారని తెలిపారు. కట్టుదిట్టమైన ప్రణాళికతో విద్యార్థులు చదివి జిల్లాను అగ్రస్థానంలో నిలిపారని అన్నారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఈఓ రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు సమష్టిగా కృషిచేశారని కొనియాడారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

పదోతరగతి ఫలితాల్లో మహాత్మా జ్యోతిబాపూలే విద్యార్థినుల హవా



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ పట్టణంలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు పదోతరగతి ఫలితాల్లో సత్తాచాటారని పాఠశాల ప్రత్యేకాధికారి మోహన్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. సౌమ్యదుర్గ, నిహారిక, రుచిత 10కి 10 జీపీఏ సాధించారని తెలిపారు. గురుకుల విద్యార్థినీల విజయం వెనుక మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డిల ప్రోత్సాహం ఉందని తెలిపారు. అలాగే డీఈఓ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయుల కృషి ఎంతైనా ఉందని తెలిపారు. మొత్తం 74 మంది పరీక్షలు రాయగా, 73 మంది ఉత్తీర్ణత సాధించారని వెల్లడించారు.

లక్కీ డిప్ పేరుతో అర్హులైన పేదలకు అన్యాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

మున్సిపల్ పరిధిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఈనెల 9న లక్కీ డిప్ పద్ధతిలో ఎంపిక చేయగా లక్కీ డిప్‌లో పేర్లు వేసిన వాళ్లలో పేదలేవరులేరని లక్కీ డిప్ పేరుతో అధికార పార్టీకి సంబంధించిన అనుకూలమైన వారి పేర్లను ఉంచి అర్హులైన పేదలకు అన్యాయం చేశారని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ అరెల్లి మల్లేష్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. లక్కీ డిప్‌లో ఉంచిన పేర్లలో కేవలం బీఆర్ఎస్ పార్టీ నాయకుల బంధువులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయ పన్ను కడుతున్న సంపన్నులు ఉన్నారని పేర్కొన్నారు. సుమారు 8 వేల మంది పేదలు అర్జీ పెట్టుకొనగా మొదటగా అర్జీలు స్వీకరించిన క్రమంలో నిజమైన లబ్ధిదారులను గుర్తించకుండా అర్హత కలిగిన వారిని అర్హత లేని వారిని ఒకే దగ్గర చేర్చడం వల్ల ఈ తప్పిదం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలోనే అర్హులైన లబ్ధిదారులకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు కాకుండా ఆర్థికంగా పలుకుబడిన వారి చేతుల్లోకి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వెళ్తున్న నేపథ్యంలో తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఇంటింటికి తెలుగుదేశం

నవతెలంగాణ-ఉట్నూర్

రాష్ట్రంలో టీడీపీని బలోపేతం చేసేందుకు గడప గడపకు తెలుగుదేశం అనే కార్యక్రమంతో ముందుకు వెళుతున్నామని టీడీపీ రాష్ట్ర యువ నాయకుడు విరేశ్ స్పష్టం చేశారు. ఎన్టీఆర్ శత జయంతోత్సవాల సందర్భంగా ఉట్నూర్‌లోని హెచ్‌కేజీఎస్ ఫంక్షన్ హాల్‌లో టీడీపీ మినీ మహానాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర యువ నాయకుడు విరేశ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజల ప్రఖ్యాతలను ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఎన్టీ రామారావుదేనని అన్నారు. అదే విధంగా కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామిలను పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలోనే టీడీపీ నూతన మ్యానిఫేస్టోను తయారు చేసి ప్రజల అభివృద్ధి పార్టీ లక్ష్యమని టీడీపీ ప్రభుత్వ ఆయాంలో చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల వివరాలతో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ముందుకు వెళుతామని అన్నారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు జయరాం, చంద్రదాస్, జిల్లా పార్లమెంటరి అధ్యక్షుడు ఆనంద్, నాయకులు రాజీరెడ్డి, భీంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి రాజేశ్వర్, పవార్ దేవిదాస్, మండల నాయకులు సునిత, రాము ఉన్నారు.

కుంసరాలో ముగిసిన తాళసప్తమి వేడుకలు

నవతెలంగాణ-భైంసా

మండలంలోని కుంసరా గ్రామంలో గత వారం రోజులుగా జరిగిన వేడుకలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు ఆలయంలో ఉట్టి కొట్టుడు కార్యక్రమాన్ని చేపట్టారు. భజన దిండిలతో గ్రామంలో శోభయాత్ర చేపట్టి పల్లకిని ఊరేగించారు. అనంతరం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. వారం రోజులుగా వచ్చిన కీర్తనపరులను భజనపరులను గ్రామ కమిటీ సన్మానించింది. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ఎమ్మెల్యే ఇంటి ముట్టడిని అడ్డుకున్న పోలీసులు

- ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన వీఓఏలు



నవతెలంగాణ-ఖానాపూర్

వీఓఏలు తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం చేపట్టిన ఎమ్మెల్యే ఇంటి ముట్టడిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఐకేపీ వీఓఏలు ఎమ్మెల్యే నివాసం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే రేఖా నాయక్‌కు తమ సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ గత 23 రోజులుగా నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 504 మంది నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైన తమ సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో తాము అసెంబ్లీని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు లావణ్య, ఉపాధ్యక్షురాలు స్వప్న, జి లావణ్య, డివిజన్ కార్యదర్శి బి.రవీందర్, సహాయ కార్యదర్శిలు శ్రావణి, సీహెచ్ రవి, కోశాధికారి సురేష్, నియోజకవర్గం కమిటీ సభ్యులు శైలజ, వనిత, కే మమత ఉన్నారు.

భైంసా: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గత 20 రోజులకు పైగా సమ్మె చేపడుతున్న ప్రభుత్వం స్పందించకపోవడంతో గురువారం మండలంలోని దేగాం గ్రామంలోని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఇంటిని ముట్టడించారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నియోజకవర్గంలోని వందలాది వీఓఏలు ఎమ్మెల్యే ఇంటి ముందు బైఠాయించారు. తమను ఐకేపీ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. 10 సంవత్సరాల పాటు ప్రభుత్వం తమను వెట్టి చాకిరి చేయించుకున్న ఇకనైనా తమ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని కోరారు. 25 రోజులుగా సమ్మె చేస్తున్న సమస్యల పరిష్కారంవైపు దృష్టి సారించకపోవడం శోచనీయమని అన్నారు. ఎమ్మెల్యే లేకపోవడంతో దేగాం గ్రామ సర్పంచ్ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఆందోళనలో వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు జయశీల, నాయకులు దేవిదాస్, రాములు, సాయిబాబా, విఠల్ ఉన్నారు.

సాగుతున్న నేషనల్ హైవే విస్తరణ పనులు

- గోదావరి నదిపై మరో బ్రిడ్జి నిర్మాణం



నవతెలంగాణ-బాసర

బోధన్ బైంసా హైవే రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. నిజామాబాద్ జిల్లా బోధన్ నుండి నిర్మల్ జిల్లా బైంసా 56.4 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులను నేషనల్ హైవే అధికారుల పర్యవేక్షణలో చేపడుతున్నారు. ఈ రహదారి విస్తరణకు సుమారు రూ.650 కోట్లను కేటాయించారు. హైదరాబాద్‌కు చెందిన అనూష కన్‌స్ట్రక్షన్ సంస్థ పనులను చేపడుతోంది. మూడు విడతలుగా పనులు చేపట్టి మూడు సంవత్సరాలలో రహదారి పనులు పూర్తి అయ్యేలా ఒప్పందం కుదుర్చుకుంది. రహదారి విస్తరణకు గతంలోనే భూమి సేకరణ, హద్దులు పూర్తి కావడంతో రహదారి విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి.

రహదారి విస్తరణతో తీరనున్న కష్టాలు...

బోధన్ బైంసా జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభం కావడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తయితే ప్రయాణానికి ఇబ్బందులు తొలగుతాయి. రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్య క్షేత్రం బాసర కావడంతో ప్రతి రోజు వందల సంఖ్యలో ఈ జాతీయ రహదారి గుండా ప్రయాణాలు సాగిస్తుంటారు. మహారాష్ట్రలోని నాందేడ్ పట్టణం వంద కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. హైదరాబాద్ వెళ్లే వారు ఈ వైపుగా ప్రయాణానికి మొగ్గు చూపే అవకాశం ఉంటుంది. రహదారికి ఇరువైపులా10మీటర్ల పొడవుతో రహదారి పనులు చేపడుతున్నారు. జిల్లాలోని ఏకైక రైల్వే స్టేషన్ బాసర కావడంతో రహదారి నిర్మాణంతో ప్రయాణికులు తాకిడి పెరిగే అవకాశం ఉంటుంది

బాసర గోదావరి నదిపై మరో బ్రిడ్జి నిర్మాణం...

గోదావరి నదిపై మరో బ్రిడ్జి నిర్మాణనికి సర్వే పూర్తి అవ్వడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ బ్రిడ్జి నిర్మాణంతో నదిపై 3 బ్రిడ్జిలు నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉంటుంది. నదిపై గతంలోనే నిజాం ప్రభుత్వ హయాంలో రైల్వే బ్రిడ్జి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మించారు. రహదారి వెడల్పు పనులతో గోదావరి నదిపై మరో రహదారి బ్రిడ్జితో నిర్మాణంతో ప్రయాణానికి సులువుగా ఉంటుంది. దీంతో పాటు పారిశ్రామికంగా సైతం ఈ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. రహదారి విస్తరణతో బాసర రైల్వే స్టేషన్ వద్ద ఆర్ఓబి నిర్మాణం చేపట్టనున్నట్లు నేషనల్ హైవే అధికారులు తెలిపారు. బాసర నుండి బైంసా వరకు ఆరు చోట్ల బైపాస్ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు వివరించారు.



పారిశుధ్య కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న 2020 బి 21 పారిశుధ్య కార్మికుల రెండు నెలల పెండింగ్ వేతనాలతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ కమిషనర్ ఏ. శైలజను కోరారు. గురువారం ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. ముందుగా మొదటి స్థాయి పురపాలక కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న కమిషనర్ స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా పదోన్నతి పొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020 – 21 బ్యాచ్ మున్సిపల్ పారిశుధ్య కార్మికుల రెండు నెలల వేతనాలు, ఏరియర్స్, పీఎఫ్ ఈఎస్ఐకి సంబంధించిన కార్డులు వెంటనే ఇప్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మున్సిపల్ కమిషనర్ ఈ నెలాఖరులోపు రెండు నెలల వేతనాలతో పాటు కార్మికుల ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు జి.మురళి, చిన్నయ్య, కే.పూల్‌చంద్, ఏ.అశోక్, జి.యాదగిరి, కె.అఖిల్, జి. మల్లేష్, రమేష్, వై. దేవిదాస్ పాల్గొన్నారు.

జేపీఎస్, ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నిర్మల్

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ వీఓఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ వీఓఏల వేర్వేరు సమ్మె శిబిరాలను సందర్శించి గురువారం సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా, ఐఎఫ్‌టీయూ, పీఓడబ్ల్యూ నాయకులు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు నంది రామయ్య, కె. రాజన్న, కె. లక్ష్మి మాట్లాడారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమను రెగ్యులర్ చేయాలని 14 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు. సమ్మెకు పరిష్కారం చూపకుండా బెదిరింపులకు పాల్పడటం శోచనీయమని అన్నారు. వెంటనే జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తూ జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామాల్లో ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకువెళ్లడంలో ఐకేపీ వీఓఏల పాత్ర ఎనలేనిదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వీఓఏలకు నెలకు రూ.10,500 గౌరవ వేతనం ఇస్తుండగా, తెలంగాణలో కేవలం రూ.3900 ఇవ్వడం దుర్మార్గమని అన్నారు. వారికి కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు.



బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీకి లేదు

- డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

బీసీ సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం రూ.2వేల కోట్లు ప్రవేశపెట్టి అవమానిస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం ఆరువేల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని, బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీకి లేదని డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని గుర్తు చేశారు. బీసీలకు డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు గురించి బీజేపీ జిల్లా అధ్యక్షులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పు పట్టారు. అర్హులైన బీసీలకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించారన్న ఆయన బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ వ్యాఖ్యలపై ధ్వజమెత్తారు. బీసీల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, కేవలం బడ్జెట్‌లో రెండు వేల కోట్ల రూపాయలను కేటాయించడమే అందుకు నిదర్శనమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి ఆరు వేల కోట్ల రూపాయలను కేటాయించిన విషయాన్నీ గుర్తు చేశారు. బీసీ సంఘ భవనాలు నిర్మిస్తూ బీసీలకు అన్ని విధాలా అండగా నిలబడుతున్నామని స్పష్టం చేశారు. కనీస అవగాహన లేకుండా బీజేపీ నాయకులు తమ నాయకులపై విమర్శలు చేయడాన్ని తప్పుపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేష్, మాజీ ఎంపీపీ లక్ష్మీ జగదీష్, నాయకులు చంద్రయ్య, కుమ్ర రాజు, ఖయ్యూం, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

లైంగికదాడికి పాల్పడ్డ వ్యక్తి అరెస్టు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్ మండల కేంద్రంలోని ఓ మహిళపై లైంగికదాడికి ఒడిగట్టిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ సీఐ బి.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం ఇంట్లో నిద్రిస్తున్న మహిళపై రాత్రి 11 గంటల సమయంలో పందిరి లింగం(45) దౌర్జన్యంగా మహిళ ఇంట్లోకి చొరబడి అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపారు. మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామని సీఐ వివరించారు.

సీసీ కెమెరాల్లో రికార్డ్ అయిన చోరీ దృశ్యాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలో రోజురోజుకూ దొంగలు రెచ్చిపోతున్నారు. కెమెరాలు ఉన్నాయని తెలిసినప్పటికీ యదేచ్ఛగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాజాగా ఆదిలాబాద్ పట్టణంలోని బస్టాండ్ ఎదుట ప్లానెట్ కంప్యూటర్ పక్కన ఉన్న ఐడియా ఫ్లెక్సీ షాప్‌కు సంబంధించిన వెనక భాగంలో గురువారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. షాప్ కు సంబంధించిన కూలర్‌తో పాటు సింటెక్స్ వాటర్ ట్యాంక్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ దొంగతనం జరిగిన దృశ్యాలన్నీ అక్కడ ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. గతంలో సైతం ఇదే ప్రాంతంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ తరుచూ దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయంటే ఇక పరిస్థితి ఎలా అని స్థానికులు వాపోతున్నారు.

జిజ్ఞాస పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో తెలుగు సహాయ ఆచార్యుడు ఆర్.సంతోష్ కుమార్ మార్గదర్శకత్వంలో రూపొందించిన, 'బుర్నూరు గ్రామ సమగ్ర చరిత్ర' అనే ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించింది. రెండు దశల్లో నిర్వహించిన జిజ్ఞాస పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి విద్యార్థులు ఈ బహుమతిని సాధించారు. ఈనెల 1న ప్రభుత్వ సిటీ కాలేజ్ హైదరాబాద్‌లో జరిగిన ప్రదర్శనలో న్యాయ నిర్ణేతల మన్ననలు పొంది వీరి ప్రాజెక్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈనెల 16న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించే బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో రూ.21 వేలు, ప్రశంసా పత్రాలు విద్యార్థులు, అధ్యాపకుడు అందుకోనున్నారు. ఈ సందర్భంగా బహుమతి సాధించిన అధ్యాపకుడుని, విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ జగ్ రామ్ అంతర్వేది, జిజ్ఞాస జిల్లా సమన్వయ కర్త కే.రమేష్, గురువారం ఒక ప్రకటనలో అభినందించారు.

వినియోగదారులకు సముచిత న్యాయం అందించేలా కృషి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వినియోగదారులకు సముచిత న్యాయం అందించేలా సంఘం తరపున కృషి చేయాలని కన్జ్యూమర్ కోర్టు న్యాయమూర్తి జాబేజ్ శామ్యూల్ సూచించారు. కన్జ్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ సేవలకు గుర్తింపుగా సివిల్ సప్లై శాఖ నుంచి పదివేల రూపాయల నగదు సాయం అందింది. ఈ మేరకు గురువారం సంస్థ ఆధ్వర్యంలో నాణ్యత ప్రమాణాల కిట్‌ను కొనుగోలు చేసి జాబేజ్ శామ్యూల్‌కు అందజేశారు. వినియోగదారులు మోసపోకుండా చూడాలని, అందుకు అవసరమైన అన్నిచర్యలు తీసుకోవాలని శామ్యూల్ అన్నారు. వినియోగదారులకు తమ హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మోటివేషన్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఇర్ఫాన్, సురేందర్, సంతోష్, కృష్ణవేణి పాల్గొన్నారు.

పదిలో మండల టాపర్‌కు సన్మానం



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థి జాదవ్ సుమిత్ బుధవారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో 9.8 గ్రేడు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ రాజ్, డీఈఓ ప్రణీత చేతుల మీదుగా శాలువాతో సన్మానించి, ప్రశంస పత్రాన్ని అందజేశారు.

ఇంటర్ విద్యార్థికి సన్మానం...

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్‌లో బైపీసీలో 961 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిన చౌహాన్ ప్రత్యూషను కలెక్టర్ రాహుల్ రాజ్, డీఐఈఓ రవీందర్ కుమార్ చేతుల మీదుగా శాలువాతో సన్మానం, ప్రశంస పత్రాన్ని అందుకున్నట్లు ప్రిన్సిపల్ ఉదయ్ కుమార్ పేర్కొన్నారు.

రిమ్స్‌లో మామోగ్రఫీ స్క్రీనింగ్ పరీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రొమ్ము, బ్రెస్ట్ కాన్సర్ వ్యాధిని నిర్ధారణకు మామోగ్రఫీ స్క్రీనింగ్ పరీక్ష కేంద్రాన్ని రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ గురువారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉచిత స్క్రీనింగ్ సెంటర్‌ను 45 ఏండ్లలోపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఈ ఉచిత స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా మహిళలు రొమ్ము, బ్రెస్ట్ సంబంధిత ఆరోగ్య సమస్యలు ఉంటే ఇక్కడకు వచ్చి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ నూతన కార్యాలయ పరిశీలన

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

మంత్రి కేటీఆర్ త్వరలో పట్టణంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న నేపథ్యంలో పట్టణంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ పరిశీలించారు. గురువారం పట్టణంలోని నూతన మున్సిపల్ కార్యాలయ పనులు తుదిదశకు చేరుకున్న నేపథ్యంలో పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయా విభాగాలకు కేటాయించిన గదులను పరిశీలించారు. సిబ్బందిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూతన కార్యాలయంలో అన్ని వసతులు, సౌకర్యాలు అందుబాటులో ఉండనున్నాయని తెలిపారు. నూతన మున్సిపల్ కార్యాలయ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయని త్వరలోనే లాంచనంగా ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, కమీషనర్ శైలజ, మున్సిపల్ ఏఈ అరుణ్, డీఈ తిరుపతి, కౌన్సిలర్ మోబిన్, ఎస్సై నరేందర్ ఉన్నారు.

గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-జన్నారం

గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రూ.500 కోట్లతో గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి గల్ఫ్ కార్మికులను ఆదుకోవాలని గల్ఫ్ సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలెడ భూమన్న అన్నారు. గురువారం మండలంలోని రాంపూర్ గ్రామ గుట్టపై ఉన్న హనుమాన్ ఆలయంలో నవగ్రహ విగ్రహాలను గల్ఫ్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ప్రతిష్టించారు. గల్ఫ్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో రూ.40,000 విలువగల నవగ్రహ విగ్రహాలను కొనుగోలు చేసి హనుమాన్ భక్తులకు అందించారు. గ్రామస్తులు గల్ఫ్ సంక్షేమ సమితి సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజు రంటెంకి సత్యం, లింగాల వెంకటేష్, తిరుపతి, సంద వెంకటేష్, గ్రామ పెద్దలు పాలేపు జగన్ మోహన్ రావు, సందినేని సురక్షన్, లింగాల గంగయ్య స్వామీ,లచయ్య స్వామి,కోమటి రాజేశం పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె విరమణ

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెను గురువారం విరమించారు. పంచాయతీ రాజ్ నుంచి మాకు స్పష్టమైన హామీ ఇచ్చారని, మీ హోదా మీకే ఉంటుందని, కొద్ది నెలలు ఓపిక పట్టండని హామీ ఇచ్చిన మేరకు సమ్మె విరమిస్తున్నట్లు పంచాయతీ కార్మికులు ప్రకటించారు. ఈ మేరకు సమ్మె విరమించినట్లు బుధవారం అధికారులకు నివేదించి గురువారం నుంచి పంచాయతీ కార్మికులు విధుల్లో చేరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విక్రంరావు, మండల పరిషత్ సూపరిడెండింట్ విజయ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు అగ్గి సత్తయ్య, దుస్స చందు నిమ్మరసం ఇచ్చి సమ్మెను విరమింప చేశారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



నవతెలంగాణ-జన్నారం

అకాల వర్షాలతో అన్ని మండలాల రైతులు ఇబ్బంది పడుతున్నారని, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడు కొండగొర్ల లింగన్న ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంతో పాటు పలు మండలాల్లో అకాల వర్షాలకు ఎండకు ఆరబోసిన వరి ధాన్యం పూర్తిగా తడిసిపోయిందన్నారు. మూడు రోజుల నుండి ఎండకు ఆరబోసిన వరి ధాన్యాన్ని రైతులు కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారని, ఒక్క సారిగా వచ్చిన వర్షం వారి ఆశలను ఆవిరి చేసిందన్నారు. తడిసిన వరి ధాన్యంలో తేమ శాతం తగ్గాలంటే చాలా కష్టమని, రైతులు మళ్లీ మొదటి నుండి శ్రమ చేయాల్సి వస్తుందన్నారు. తేమ పేరుతో రైతులను హింసించకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నామన్నారు.

పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు అభివృద్ధి పనులను మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు గురువారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాలా సహాయపడతానని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా 9వ వార్డులో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన రోడ్డు, డ్రైనేజీ, 3వ వార్డులోని కృష్ణ కాలనీలో రూ.7 లక్షల వ్యయంతో డ్రైనేజీని నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, పీఏసీఎస్ చైర్మన్ సందేల వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు అక్కురి సుబ్బయ్య, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి, కౌన్సిలర్లు పూదరి కుమార్, చిడం మహేష్, కోఆప్షన్ సభ్యులు నాజర్ పాల్గొన్నారు.

జైలు జీవితంతో పరివర్తనం రావాలి

- సీనియర్ సివిల్ జడ్జి యువరాజ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జైలు జీవితంతో ఖైదీల ప్రవర్తనలో పరివర్తన రావాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జ్ కె.యువరాజ సూచించారు. జిల్లా కేంద్రంలోని సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పుల వల్ల ఒక కుటుంబం రోడ్డున పడుతుందని అన్నారు. జైలులో నేర్చుకున్న పలు మంచి అంశాలు నిత్య జీవితంలో అనువర్తింప చేసుకోవాలని సూచించారు. నేర ప్రవృత్తి వల్ల సమాజంలో గుర్తింపు కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. చట్టాలపై ఖైదీలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారి ప్రేమ్ కుమార్, అడ్వకేట్ నరహరి, కిషోర్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

జీఓ నెం.76 ప్రగతిపై సమీక్షా సమావేశం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో గురువారం జీఓ నెం. 76 ప్రగతి పై మంచిర్యాల కలెక్టర్ బాధవత్ సంతోష్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీఓ నెం. 76 రెగ్యులరైజేషన్ కోసం ఆమోదం పొందిన దరఖాస్తుదారులు ఈ వారం లోగా డీడీలు తీసి తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తే వారంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసి పట్టాలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఆర్పీలు, కౌన్సిలర్లు లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించి డీడీలు కట్టించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం కళ, వైస్ చైర్మన్ విద్యాసాగర్, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్డీఓ దాసరి వేణు, మందమర్రి తహసీల్దార్ సంపతి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ పాల్గున్నారు.

16లోగా ఇంటర్ సప్లమెంటరీ ఫీజులు చెల్లించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఫెయిలైన ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఈ నెల 16వ తేదీలోగా సప్లమెంటరీ పరీక్ష ఫీజులు చెల్లించాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనరల్, ఒకేషనల్ పరీక్షల్లో ఫెయిలైన వారు వార్షిక ఫీజు రూ.500, ప్రాక్టికల్ ఫీజు 210, బ్రిడ్జి కోర్సు ఫీజు రూ.160 చొప్పున చెల్లించాలని అన్నారు. కళాశాల సిబ్బంది ఆన్ లైన్‌లో కన్ఫర్మ్ చేసి ఆన్ లైన్ చెల్లింపులు చేయాలని, విద్యార్థులు వెంటనే తమ వార్షిక పరీక్ష ఫీజు, మెమో జీరాక్స్ సమర్పిస్తూ కళాశాలల్లో ఫీజులు చెల్లించాలని సూచించారు.

కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమం

నవతెలంగాణ-భీమిని

మండల కేంద్రంలో ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి లక్ష్మణ్ సౌజన్యంతో శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి గురువారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. 46వ వారం శ్రీ రామ సేవా సమితి అధ్యక్షులు పోతురాజుల లక్ష్మణ్, పోతురాజుల రమేష్, తిరుపతి, ప్రదీప్, ముత్తినేని వివేక్, నవీన్, వైష్ణవి, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇసుక డబ్బులు జమయ్యేదెప్పుడు..?

- జిల్లాలో రూ.2 కోట్ల వరకు బకాయిలు
- నెల రోజులుగా ట్రాక్టర్ యజమానుల ఎదురుచూపులు
- త్వరగా డబ్బులు చెల్లించాలంటున్న ట్రాక్టర్ ఓనర్లు

నవతెలంగాణ-హాజీపూర్



